క్లుప్తంగా

బంగారు యజ్ఞోపవీతం బహూకరణ



పూజల్లో పాల్గొన్న శ్రీనివాసరావు, అనురాధ దంపతులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామివారికి హుజూర్‌నగర్‌కు చెందిన నారపరాజు శ్రీనివాసరావు -అనురాధ దంపతులు బుధవారం రూ.లక్ష విలువ గల బంగారు యజ్ఞోపవీతాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. సీతారాముల కల్యాణం జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

స్వర్ణభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో చెరకు రసం పంపిణీ



బాటసారులకు చెరకు రసం పంపిణీ చేస్తున్న చలివేంద్రం నిర్వాహకులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని రంగా థియేటర్ సెంటర్‌లో స్వర్ణభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో శ్రీరామనవమి సందర్భంగా బుధవారం పాదచారులకు చెరకు రసం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ గౌరవ సలహాదారుడు పైడిమర్రి సత్యబాబు, అధ్యక్షుడు గాదంశెట్టి శ్రీనివాసరావులు మాట్లాడుతూ స్వర్ణభారతి ట్రస్ట్ చేపట్టే సేవా కార్యక్రమాలకు దాతలు ముందుకొచ్చి సహకారం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో దాత చంద్రా వెంకటేశ్వరరావు, చెన్నకేశవరావు, సాంబశివరావు, రామారావు, వెంపటి పద్మ, మధు, హైమావతి తదితరులు ఉన్నారు.

తోరణం నిర్మాణం అభినందనీయం

తుంగతుర్తి : ఆలయానికి తోరణ నిర్మాణం చేయడం అభినందనీయమని ఆర్యవైశ్య సంఘం నాయకులు ఓరుగంటి సత్యనారాయణ, తాటికొండ సీతయ్య అన్నారు. మండలంలోని వెంపటి గ్రామంలో శ్రీగణేష, శ్రీసీతారామ (పట్టాభిషేక) సతీసమేత, శ్రీఉమామహేశ్వర సమేత దేవాలయ తోరణ నిర్మాణం గ్రామానికి చెందిన తల్లాడ వెంకటనర్సయ్య లక్ష్మమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు తల్లాడ నారాయణ-ధనలక్ష్మి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో రూ.6లక్షలతో ఏర్పాటు చేసిన తోరణాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు ఓరుగంటి శ్రీనివాస్, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకురాలు దాయం ఝాన్సీరాజిరెడ్డి, అబ్బగాని సత్యనారాయణ, మూల సుధాకర్‌రెడ్డి, సగ్గం నర్సయ్య, తునికి సాయిలు, ఈగ దయాకర్, ఈగ నాగన్న, తల్లాడ సురేష్, శ్రీను, శేఖర్, రమేష్, సంజీవరెడ్డి, కటికిరెడ్డి వెంకన్న, కొండ వెంకన్న, రాజయ్య, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఎన్నికల్లో రాజకీయ నాయకులు చూపే డబ్బు ఎరకు ఆశపడితే మరో ఐదేళ్ల వరకు మోసపోవడం ఖాయమని జైభారత్ బీసీ పోరాట వేదిక రాష్ట్ర అధ్యక్షుడు దుస్సా రామ్మూర్తి అన్నారు. బుధవారం పట్టణంలో ఓటు అమ్ముకోవద్దు, డబ్బుకు, మద్యానికి ఓటు అమ్ముకుంటే బతికి ఉన్న శవంతో సమానమనే పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పార్టీలతో సంబంధం లేకుండా పోటీ చేసే అభ్యర్థుల నైతిక ప్రవర్తన, అర్హత, నిబద్ధత, సమర్థత మొదలైన వాటిని చూసి అభ్యర్థులను ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీనునాయక్, వెంకన్న, చాంద్‌పాషా, రాంప్రభు, బ్రహ్మం, వీరేష్‌నాయక్, మహేష్, సోమకృష్ణ, శంభయ్య, కోటయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థిని గెలిపించాలి



నాగారంలో మాట్లాడుతున్న కడియం కుమార్

నాగారం : భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ మండల కార్యదర్శి కడియం కుమార్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నతనం నుంచే వామపక్ష రాజకీయాలకు ఆకర్షితుడై నిరంతరం, నిజాయితీగా ప్రజల పక్షాల పోరాడుతున్న వ్యక్తి జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. పేద ప్రజల సమస్యలపై, నిరుద్యోగుల సమస్యలపై పోరాడిన వ్యక్తి జహంగీర్ అని అన్నారు. దేశంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న నరేంద్రమోదీ ప్రభుత్వం నిరుద్యోగాన్ని పెంచి పోషించిందన్నారు. కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెట్టిందన్నారు. గుడపూడి వెంకటేశ్వర్లు, మారయ్య, వెంకన్న, కండె భిక్షం, దేవరకొండ వెంకన్న, పద్మ, స్వరూప, మల్లమ్మ పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలో శ్రీరామనవమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన రామాలయం, మున్సిపాలిటీ పక్కన గల స్థలం, భవానీనగర్‌లోని శ్రీవరసిద్ధి వినాయక సన్నిధిలో, బొడ్రాయి, శ్రీమన్నారాయణ, శ్రీనగర్ కాలనీలలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, పీసీసీ సభ్యుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, గుండపనేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోదాడ మండలంలో..

కోదాడరూరల్ : కోదాడ మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమిని బుధవారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మరలో రెండో భద్రాద్రిగా పేరొందిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ఆవరణలో సీతారాముల కల్యాణ వేడుకలను వైభవంగా జరిపారు. కల్యాణాన్ని తిలికించేందుకు స్థానికులతో పాటు కోదాడ, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. స్వామివారికి తలంబ్రాలు, పట్టు వస్త్రాలను అనంతగిరి మండలం కిష్టాపురానికి చెందిన కత్రం వంశీయులు సమర్పించారు. అదేవిధంగా రెడ్లకుంట, రామలక్ష్మీపురంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాలు, తొగర్రాయిలో వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్‌లు సాధినేని అప్పారావు, అమరనేని వెంకటేశ్వరరావు, అన్నెం చిన్న వెంకట్‌రెడ్డి, గంగవరపు లక్ష్మణ్‌రావు, భక్తులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ పట్టణంలో..

హుజూర్‌నగర్ : పట్టణంలో శ్రీరామనవమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ, లక్ష్మణ హనుమంతుడి విగ్రహాలను మేళతాళాలతో పుర వీధుల్లో ఊరేగించారు. పట్టణంలోని పలు ఆలయాలు, వివిధ వార్డులలో సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా జరిపారు. అనంతరం భక్తులకు వడ పప్పు, బెల్లం పానకం, తీర్థ ప్రసాదాలు, పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమాలలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, పుర ప్రముఖులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

అనంతగిరి మండలంలో..

అనంతగిరి : మండల వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీరఘునాథస్వామి ఆలయంతో పాటు అన్ని గ్రామాల్లో రామాలయాల్లో శ్రీసీతారాముల కల్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు. శ్రీరఘునాథస్వామి ఆలయంలో జరిగిన శ్రీసీతారాముల కల్యాణానికి యశోధ హాస్పిటల్స్ అధినేత గోరుగంటి జయశ్రీ తలంబ్రాల బియ్యం, బంగారు పుస్తెలు, వెండి మెట్టెలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో కొండపల్లి వాసు, దేగ బాబు, దేగ కొండయ్య, ఆలయ అధికారి శంభిరెడ్డి, పందిరి వీరయ్య, పల్లపు శ్రీనివాస్, దండు లింగయ్య, గోళ్ల పున్నయ్య, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరిలో సీతారామచంద్రస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



మఠంపల్లిలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కోదాడరూరల్ : రెడ్లకుంటలో..



మోతెలోని ఆంజనేయస్వామి ఆలయంలో..



చిలుకూరు రామాలయంలో..

మోతె మండలంలో..

మోతె : మండల కేంద్రంతో పాటు రావిపహాడ్, రాఘవాపురం, అన్నారిగూడెం, సర్వారం, కొత్తగూడెం, మామిళ్లగూడెం గ్రామాల్లో బుధవారం శ్రీరామనవమిని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. పలు గ్రామాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

నడిగూడెం మండలంలో..

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయాల అర్చకులు వేదాంతం చక్రధరాచార్యులు, వరదాచార్యులు, రాజశేఖర్ శర్మ, మురళీశర్మ, భక్తులు పాల్గొన్నారు.

చిలుకూరు మండలంలో..

చిలుకూరు : మండల వ్యాప్తంగా శ్రీరామనవమి పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామచంద్రస్వామి కల్యాణం జరిపారు. భక్తులకు అన్నదానం చేశారు.

మునగాల మండలంలో..

మునగాల : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని రామాలయంలో స్థానిక ఎస్‌ఐ బైరెడ్డి అంజిరెడ్డి దంపతులు పీటలపై కూర్చొని సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన శెట్టి గిరి దంపతులు 1500 ప్యాకెట్ల మజ్జిగను భక్తులకు పంపిణీ చేశారు. ముకుందాపురంలో ఎంపీటీసీ నూకమళ్ల ఇందిర దంపతులు, మాజీ ఎంపీటీసీ నర్రా అన్నపూర్ణ దంపతులు, రిటైర్డు ఉపాధ్యాయులు నర్రా సత్యనారాయణరెడ్డి దంపతులు పీటలపై కూర్చొని స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. జగన్నాథపురంలో ఆలయ కమిటీ చైర్మన్ గుడిపూడి సుధాకర్, సైదాచారి, షేక్ జానీ, నాగుల్‌మీరా, లతీఫ్ తదితరులు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పురోహితులు వారణాసి వెంకటరమణశాస్త్రి, కిశోర్‌శర్మ, కందిబండ సత్యనారాయణ, నల్లపాటి శ్రీనివాస్, దేవినేని సీతారామయ్య, భక్తులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ మండలంలో..

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురం, బూరుగడ్డ, వేపలసింగారం తదితర గ్రామాల్లో బుధవారం శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు వేద మంత్రోత్సవాల నడుమ జరిపారు. బూరుగడ్డలో ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శాసనాల నాగసైదయ్య, ఎంపీటీసీ ముడె గోపిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పాలకవీడు మండలంలో..

పాలకవీడు : మండల వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలను బుధవారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయాల్లో శ్రీసీతారాముల కల్యాణాన్ని అర్చకులు వైభవంగా జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం వేళ సీతారామచంద్రస్వామిని గ్రామాల్లోని పుర వీధుల్లో ఊరేగింపు చేశారు.

మఠంపల్లి మండలంలో..

మఠంపల్లి : మండలంలో శ్రీరామనవమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మఠంపల్లి, పెదవీడు, రఘునాథపాలెం తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. రఘునాథపాలెంలో స్థానికులతో పాటు ముస్లింలు రాములోరి కల్యాణోత్సవంలో పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బాడవాతండాలో జెడ్పీటీసీ జగన్‌నాయక్ దంపతులు, గుర్రంబోడుతండాలో ఎంపీపీ పార్వతీకొండా నాయక్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. పెదవీడులో కల్యాణ మహోత్సవానికి హాజరైన సీఐ గజ్జి చరమందరాజు, ఎస్‌ఐ రామాంజనేయులుకు గ్రామపెద్దలు మొక్క అందజేసి సత్కరించారు. మఠంపల్లిలో అర్చకులు సోమయాజుల సూర్యనారాయణమూర్తిశాస్త్రి స్వామివారి కల్యాణం నిర్వహించారు. సాగర్ సిమెంట్స్ కాలనీలో కల్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో ప్రజలు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేరేడుచర్ల మండలంలో..

నేరేడుచర్ల : మండల వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలను బుధవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రామాలయాల్లో వేద పండితుల మంత్రోత్సవాల మధ్య సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గరిడేపల్లి మండలంలో..

గరిడేపల్లి : మండల వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు కీతవారిగూడెం, పొనుగోడు, కల్మలచెరువు, ఎల్‌బీనగర్ గ్రామాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా జరిపారు. గరిడేపల్లిలో స్వామివారికి పలువురు భక్తులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా గరిడేపల్లి రామాలయం అభివృద్ధికి ఓరుగంటి నాగభూషణం జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులు ఓరుగంటి వెంకటేశ్వర్లు రూ.4లక్షలు విరాళం ప్రకటించారు. మిర్యాలగూడెంకు చెందిన సూర్యతేజ రైస్ మిల్లు యాజమాన్యం రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఆలయ అభివృద్ధికి చేయూతనందిస్తున్న ప్రతి ఒక్కరికీ ఆలయ కమిటీ చైర్మన్ మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో త్రిపురం అంజన్‌రెడ్డి, పైడిమర్రి రంగనాథ్, నర్సింహారావు, పోలిశెట్టి నాగేశ్వరరావు, ముచ్చర్ల పెద్ద నర్సింహారావు, బండా నర్సిరెడ్డి, ఓరుగంటి శ్రీనివాస్, ఎడ్ల అంజన్‌రెడ్డి, పెండెం ముత్యాలుగౌడ్, అంజి, సైదులు, అంజయ్య, కృష్ణ, లక్ష్మారెడ్డి, సైదులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



నడిగూడెం : శ్రీకోదండరామస్వామి ఆలయంలో..



హుజూర్‌నగర్ : స్వామివార్ల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు



నేరేడుచర్లలోని నూతన రామాలయంలో..



మునగాల : కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎస్‌ఐ అంజిరెడ్డి దంపతులు



పాలకవీడులో..



మఠంపల్లి : బాడవాతండాలో పాల్గొన్న జెడ్పీటీసీ దంపతులు



అనంతగిరిలో ఎదుర్కోళ్ల మహోత్సవం



గరిడేపల్లి : రాములోరి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్



కోదాడరూరల్ : తమ్మరలో అన్నదానం ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రమీల



హుజూర్‌నగర్‌రూరల్ : బూరుగడ్డలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న యరగాని నాగన్న

పోడు రైతుల సమస్యలు పరిష్కరించాలి

పాలకవీడు : హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మఠంపల్లి, మేళ్లచెరువు, పాలకవీడు మండలాల్లో పోడు భూములు సాగు చేస్తున్న రైతుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయ నాయుడు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. అనేక ఏళ్లుగా పోడు భూములను సాగు చేసుకుంటున్న రైతులను గుర్తించి పట్టాలు అందజేయాలన్నారు. ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా హామీలు ఇస్తున్నారే తప్ప అమలు చేయడం లేదని ఆరోపించారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నడిగూడెం : మండలంలోని సిరిపురం, నారాయణపురం, చెన్నకేశ్వాపురం, రత్నవరం గ్రామాల్లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున గురువారం ఉదయం ఏడు గంటల నుంచి 11 గంటల వర కు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఎస్‌కె.సైదా బుధవా రం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చనుపల్లి 11కేవీ ఫీడర్ పరిధిలో..

అనంతగిరి : మండలంలోని చనుపల్లిలో 11 కేవీ విద్యుత్ లైన్‌కు తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున చనుపల్లి 11కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ కీర్తిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

సోమయ్య మృతికి సంతాపం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకుడు గుండా సోమయ్య (75) బుధవారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని పలువురు సందర్శించి సంతాపం ప్రకటించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో దొంతగాని సత్యనారాయణ, జానీ, సాయిరాం, గంజి నరసింహారావు, మస్తాన్ వలి సాంబయ్య తదితరులు ఉన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

నాగారం : వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా అధికారులు మండలంలోని లక్ష్మాపురం, మేగ్యాతండా, శాంతినగర్ గ్రామాల్లో బుధవారం బోర్ల మరమ్మతులు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీఓ ధార శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పైపులైన్ లీకేజీలు, హాండ్ బోర్ల మరమ్మతులు, బోర్ల ఫ్రెషింగ్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ చందన, పంచాయతీ కార్యదర్శులు గోపి, వీరేందర్ తదితరులు ఉన్నారు.

ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలి



ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

అర్వపల్లి : రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని మండల వ్యవసాయ అధికారి రావి శశిధర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల పరిధిలోని కుంచమర్తి, అర్వపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి మాట్లాడారు. ధాన్యంలో మట్టిపెళ్లలు, బెరుకులు లేకుండా తూర్పార పట్టాలన్నారు. 17శాతం వరకు తేమ ఉంటె వెంటనే కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు శోభారాణి, నేరెళ్ల సత్యం, వీఓఏలు కృష్ణకుమారి, సుజాత, సెర్ప్ కేంద్రాల నిర్వాహకులు, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బలహీన వర్గాల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

నూతనకల్ : బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండల పరిధిలోని మిర్యాల గ్రామానికి చెందిన 200మంది బీఆర్‌ఎస్ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో అరాచకాలు పెరగడంతో పాటు ప్రతిపక్ష పార్టీల నాయకులను ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు ప్రతి పేద వాడికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసి కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసిన బీఆర్‌ఎస్ నాయకులకు కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని నిషేధిస్తున్నట్లు ఆయన తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జెన్నారెడ్డి వివేక్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, మెంచు చక్రయ్య, దరిపెల్లి వీరన్న, గోరుగంటి రాంచందర్ రావు, ఇరుగు కిరణ్, అనంతుల శ్రీను, పన్నాల మల్లారెడ్డి, పసుల అశోక్ యాదవ్, రమేష్, మధు, రఘు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా సామ అభిషేక్‌రెడ్డి

అర్వపల్లి : భువనగిరి పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా జాజిరెడ్డిగూడెం మండలం కోడూరుకు చెందిన సామ అభిషేక్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు భువనగిరి పార్లమెంట్ ఎన్నికల కాంగ్రెస్ ఇన్‌చార్జ్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కాంగ్రెస్ శ్రేణులు అత్యధిక మెజార్టీ గెలిపించాలని కోరారు. శాసనసభ ఎన్నికల మాదిరిగానే మంచి మెజార్టీ రావడానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

శిథిలావస్థలో మేజర్ కాల్వపై వంతెన

- 50 ఏళ్ల క్రితం నిర్మాణం
- వంతెనపై నిత్యం రాకపోకలు సాగిస్తున్న వందలాది వాహనాలు
- ప్రమాదం జరగకముందే కూల్చి నూతన బ్రిడ్జి నిర్మించాలని వేడుకోలు

మఠంపల్లి : మండల కేంద్రం నుంచి వివిధ గ్రామాలు, గిరిజన తండాలకు వెళ్లే రోడ్డుపై అల్లీపురం, కొత్తతండాల సమీపంలో మట్టపల్లి మేజర్ కాలువపై సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని నిత్యం ఈ మార్గంలో తిరిగే వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. వంతెన ప్రమాదకరంగా ఉన్నా ఆర్టీసీ బస్సులు సైతం దశాబ్దాలుగా ఈ వంతెనపై నుంచి రాకపోకలు సాగించాయి.

మట్టపల్లి క్షేత్రానికి ఇక్కడి నుంచే..

కాగా, మండలంలోని కొతత్తండా, కాల్వపల్లితండా, అల్లీపురం, భీల్యానాయక్‌తండాతో పాటు హుజూర్‌నగర్ మండలంలోని అంజలీపురం, అమరవరం, శ్రీనివాసపురం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు, ప్రయాణికులు ప్రతి నిత్యం ఈ మట్టపల్లి మేజర్ కాలువపై నుంచే ప్రయాణిస్తుంటారు. అంతేకాకుండా మండల కేంద్రమైన మఠంపల్లిలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య బ్యాంకులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలతో పాటు ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి, పలు సిమెంట్ పరిశ్రమలకు ఈ వంతెన పై నుంచే ప్రయాణికులు, విద్యార్థులు అధిక సంఖ్యలో ప్రయాణాలు సాగిస్తుంటారు. కావున శిథిలావస్థకు చేరిన ఈ వంతెనను తొలగించి నూతన నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



కొత్తతండా సమీపంలో మట్టపల్లి మేజర్‌పై శిథిలావస్థకు చేరిన వంతెన

ప్రమాదాలు జరుగుతున్నాయి



మట్టపల్లి మేజర్ కాలువపై ఉన్న పురాతన వంతెన శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రమాదకరంగా మారింది. రాత్రి సమయంలో వంతెన వద్ద వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. దానిని తొలగించి నూతన వంతెన నిర్మించాలి.

– బానోతు భరత్‌నాయక్, స్పందన యూత్ అధ్యక్షుడు, కాల్వపల్లితండా

అధికారులు చొరవ చూపాలి



మండల కేంద్రానికి నిత్యం వందలాది వాహనాలు మేజర్ కాల్వపై గల వంతెనపై ప్రయాణం సాగిస్తున్నారు. వంతెన ప్రమాదకరంగా ఉందని పలుమార్లు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం. కాలువకు నీరు రాకముందే వంతెన నిర్మించేందుకు అధికారులు చొరవ చూపాలి.

– వీణానాయక్, మాజీ ఎంపీటీసీ, కొత్తతండా